క్లుప్తంగా

పోషకాహారం అందించేందుకు కృషి



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని శాంతిపేట ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.విజయలక్ష్మి పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వండే వంటపాత్రలు, భోజనం రుచిగా ఉన్నదీ లేనిదీ రుచిచూసి పరిశీలించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేలా మధ్యాహ్నభోజన నిర్వాహకులు కృషి చేయాలని చెప్పారు. ఆమెతో పాటు ఎంఈఓ షేక్, మహబూబ్ సుభానీ, సీఆర్ఎంపీలు కోటేశ్వరమ్మ, సుశీల, ఉపాధ్యాయులు షేక్ అబ్దుల్ రజాక్, జ్యోతి, మల్లేశ్వరి, ఎస్‌కే మస్తాన్‌వలి ఉన్నారు.

చెరువులు సాగర్ జలాలతో నింపేందుకు చర్యలు



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులను సాగర్ జలాల నింపుతున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లోని చెరువులు 45 శాతం నీటితో నింపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఫిరంగిపురంలోని చెరువుతో పాటు వేమవరం, కండ్రిక, మేరికపూడి, మునగపాడు, గుండాలపాడు, వేములూరిపాడు, నుదురుపాడు, అమీనాబాద్, 113 తాళ్లూరు గ్రామాల్లోని చెరువులను నీటితో నింపుతున్నామన్నారు. మరో ఐదు రోజుల పాటు నీటి సరఫరా ఉంటుందని చెప్పారు. రేపూడిలోని సమగ్ర తాగునీటి పథకానికి సంబంధించి చెరువునకు ఇంజిన్లతో పంపిస్తున్నట్లు వివరించారు.

డ్రైనేజీ పూడిక తీత



తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పలుచోట్ల కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పూడికతీత పనులు చేపట్టారు. వర్షాకాలంలో మురుగునీటి సమస్యను పరిష్కరించి దోమలు నివారించేందుకు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని కార్పొరేషన్ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పొక్లెయిన్ ద్వారా ముందుగా ఔట్‌ఫాల్ డ్రైన్ పనులు చేపట్టారు. సీతానగరం గోరా కాలనీ, పట్టాభిరామయ్య కాలనీ, రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం, కొలనుకొండ, చిర్రావూరు ప్రాంతాల్లో ఈ పూడికతీత పనులు చేపట్టారు. చిర్రావూరు, వడ్డేశ్వరంలో ఆక్రమణలు తొలగించి పొదలు తొలగింపు చర్యలు నిర్వహిస్తున్నారు.

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి



నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేయకుండా తాత్సారం చేస్తున్నారని జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు ఈమని చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం పాతగుంటూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ అధ్యక్షుడు ఏసుబాబును అగ్రకులానికి చెందిన వారు కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించిన నేపథ్యంలో గత కొద్ది రోజుల క్రితం పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కాని పోలీసులు 41 సీ కింద స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపివేశారని ఆరోపించారు. అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు అయితే వెంటనే నిందితులను అరెస్టు చేయాలని చట్టం చెబుతున్నా పోలీసుల అధికారులు ఆ దిశగా నిందితులను అరెస్టు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. దీనికి తోడు అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు నిందితులకు అండగా నిలవడం సమంజసం కాదని చెప్పారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నిందితులను వెంటనే అరెస్టు చేసి బాధితుడికి తగిన న్యాయం చేయాలని కోరారు.

గండాలయ స్వామి కొండకు మహర్దశ

- రూ.కోటి దాతల సహకారంతో గుడి నిర్మాణం
- తుది దశకు చేరుకున్న పనులు
- భక్తులకు రూ.36 లక్షలతో ప్రత్యేక షెడ్డు నిర్మించిన దాత
- శరవేగంగా కొనసాగుతున్న పనులు





తుది దశకు చేరుకున్న గండాలయ స్వామి గుడి పనులు

మంగళగిరి: పట్టణంలో గండాలయ స్వామి దర్శనానికి సకల ఏర్పాట్లు చేశారు. కొండపైకి వెళ్లి గండాలయ స్వామికి దీపం పెడితే గాలైనా వానైనా వెలుగుతూనే ఉంటుంది. దీపం వెలగడానికి గండాలయ స్వామి అని భక్తులు నమ్ముతారు. అంతటి ప్రాధాన్యం కలిగిన గండాలయస్వామి (గండ దీపం) దశాబ్దాలుగా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చర్యలు చేపట్టారు. ఆదివారం అమావాస్య రోజులలో భక్తులు కొండపైకి గండ దీపానికి నూనె వడ్డించి ప్రత్యేక పూజలు చేస్తారు. అలాంటి కొండపైకి వెళ్లేందుకు భక్తులకు దారి కూడా సరిగా లేకపోవడంతో ఎమ్మెల్యే ఆర్కే అటవీశాఖ అధికారులను కలిసి గండాలయ స్వామి కొండకు ట్రెక్కింగ్ మార్గంతో పాటు నడకదారి ఏర్పాటు చేయించారు. కొండపైన భక్తులు సేదదీరేందుకు అల్పాహారం తీసుకునేందుకు వానైనా ఎండైనా భక్తులకు ఇబ్బందులు లేకుండా పట్టణానికి చెందిన దేవతి భగవన్నారాయణ కుటుంబం ముందుకు వచ్చి రూ.36 లక్షలతో షెడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. కొండపైన పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు నాటడంతో కొండ ఆహ్లాదంతో పాటు భక్తులకు ఆరోగ్యాన్ని ఇస్తుంది.

గుడి నిర్మాణానికి..

గండాలయ స్వామికి గుడి లేకపోవడంతో మంగళగిరికి చెందిన 12 మంది భక్తులు భక్త బృందంగా ఏర్పడి స్వామికి నూతనంగా గుడి నిర్మాణం చేపట్టగా గుడి నిర్మాణం తుది దశకు చేరింది. రూ.కోటి అంచనాలతో నిర్మాణం ప్రారంభం కాగా మరింత పెరిగినా గుడి నిర్మాణం పూర్తి చేసేందుకు భక్త బృందం చర్యలు తీసుకుంటున్నారు. గతంలో భక్తులు కొండపైకి వెళ్లే అవకాశం లేదు. అర్చకులు మాత్రమే శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవానికి వెళ్లి దీపం వెలిగించేవారు. దాతల సహకారంతో ఆలయానికి వసతులు సమకూరుతుండడంతో భక్తులు కొండకు చేరుకుని స్వామిని దర్శించుకుంటున్నారు. ప్రతి నెల అమావాస్య రోజులు పెద్ద సంఖ్యలో భక్తులు కొండపైకి చేరుకుని గండదీపంకు నూనె వడ్డించి పూజలు నిర్వహిస్తారు. దాతల సహకారంతో పానకాల లక్ష్మీ నృసింహస్వామి ఆలయం నుంచి మెట్లు నిర్మించడంతో భక్తులు కొండపైకి చేరుకుని గండాలయ స్వామిని దర్శించుకుంటున్నారు. గండాలయ స్వామికి కొండ నిర్మాణం పూర్తి అయితే పట్టణం ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందడంతో పాటు నృసింహస్వామి ఆలయం, శ్రీ పానకాల లక్ష్మీనృసింహసామి ఆలయాలకు తరలిరానున్న భక్తులు, సందర్శకులతో మంగళగిరి పట్టణం ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా విరాజిల్లునుంది.

ఇంటి వద్దే పెన్షన్ల పంపిణీ

ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా

తాడేపల్లిరూరల్/మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఇంటివద్దకే అందజేసే విధంగా సచివాలయంలో ప్రణాళిక రూపొందించాలని కార్పొరేషన్ కమిషనర్ అలీమ్ బాషా కోరారు. మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులస్తులతో విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీన అందజేసే సామాజిక పెన్షన్లను ప్రతి సచివాలయ సిబ్బంది పాల్గొని లబ్ధిదారులకు ఇంటి వద్దే అందజేయాలని కోరారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోగా వంద శాతం పూర్తి చేయాలని ఆయన అన్నారు. కార్పొరేషన్ పరిధిలో వృద్ధాప్య, ఒంటరి మహిళలు, మత్స్యకారులకు రూ.4 వేలు 11,558 మందికి గాను రూ.4,62,32,000 లు, వికలాంగులకు రూ.6,000 చొప్పున 1340 మందికి రూ.80,40,000, వివిధ వైద్య కారణాలతో అందించబడే పెన్షన్ రూ.15,000 (ప్రతినెల) 18 మందికి గాను 2,70,000, కిడ్నీ, కాలేయం మరియు గుండె సంబంధిత వ్యాధుల వారికి ఇచ్చే పెన్షన్ రూ. 10 వేల రూపాయలు 56 మందికి గాను రూ.5,60,000, సైనిక సంక్షేమ పెన్షన్, అమరావతి పెన్షన్లు నెలకు రూ.5 వేల చొప్పున 87 మందికి గాను రూ.4,35,000, అభయ హస్తం పెన్షన్ నెలకు రూ.500 చొప్పున మొత్తం 51 మందికి గాను రూ.25,500, మొత్తం 13110 మందికి సుమారు రూ.5,55,62,500 పెన్షన్ల సొమ్మును 285 మంది సచివాలయ సిబ్బంది, నగరపాలక సిబ్బందితో పాటు 11 మంది పర్యవేక్షణాధికారులు పెన్షన్‌ను పంపిణీ చేయాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి....

నగరపాలక సంస్థ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో వర్షం నీరు, మురుగునీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయని, వాటిని నివారించి మురుగునీటి సమస్యను పరిష్కరించే విధంగా వారి సచివాలయాల పరిధిలో చర్యలు చేపట్టాలని, మురుగునీటి సమస్యను, దోమల నివారణకు ఎటువంటి అవసరమున్నా కమిషనర్ కార్యాలయంలో వెంటనే తెలియజేయాలని, ప్రజలు దోమల వల్ల జ్వరాల బారిన పడకుండా, ఇతర వ్యాధులకు గురికాకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత మనపై ఉందని, ఆయా సచివాలయ పరిధిలో శానిటరీ సెక్రటరీలు, శానిటరీ సూపర్ వైజర్లు డ్రైనేజీలలో పూడికతీత పనులు తీయించని ఎడల వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. అనంతరం పూర్వ డెప్యూటీ డైరెక్టర్ టి.రత్న జోసఫ్, ప్రత్యేక ప్రాజెక్టర్ ఏర్పాటు చేసి నిల్వ ఉన్న చెరువు నీటిలో దోమలను నివారించడానికి చేపట్టాల్సిన చర్యలు, మురుగునీటిలో దోమల నివారణ చర్యలు, వివిధ అంశాలపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీహెచ్ఈఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు నోడల్ ఆఫీసర్ల నియామకం

తాడికొండ: మండల పరిధిలో గ్రామ పంచాయతీల అభివృద్ధి పనుల పర్యవేక్షణ నిమిత్తం పంచాయతీల వారీగా నోడల్ అధికారులను నియమించినట్లు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, పరిశ్రమల శాఖ డీడీ మోపర్తి సుధాకర్ మంగళవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియమించిన నోడల్ ఆఫీసర్లు తాడికొండకు ఎంపీడీఓ అనూరాధ, నిడుముక్కలకు తహసీల్దారు నాసరయ్య, లాం గ్రామానికి ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, పొన్నెకల్లుకు హౌసింగ్ ఏఈ ఓబులరెడ్డి, మోతడకకు డెప్యూటీ తహసీలార్ కాకుమాను ప్రసాద్, బేజాత్పురంకు విద్యుత్ ఏఈ వెంకటరవికుమార్, గరికపాడుకు వెలుగు సీసీ రాఘవ, రావెల గ్రామానికి పంచాయతీరాజ్ ఏఈ వై.వి.శ్రీనివాస్‌కుమార్, పాములపాడుకు వెలుగు ఏపీఎం ఆర్.సాంబశివరావు, లచ్చన్నగుడిపూడికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సి.హెచ్. నాగేశ్వరరావు, ఫణిదరంకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కృష్ణకుమారి, ముక్కామలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ, కంతేరు గ్రామానికి ఏఎస్ఓ శ్రీధర్, బండారుపల్లికి ఎంఈఓ–1 ఇందిర, దామరపల్లికి ఎంఈఓ–2 బి.ప్రభాకరరావులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు ప్రతి బుధవారం ఆయా గ్రామాలను పరిశీలించి మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమీక్ష సమావేశానికి హాజరై ప్రత్యేక అధికారికి నివేదిక అందజేయాలని కోరారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్ బాబు, ముసుగులో ఉన్ననిందితుడు

పట్నంబజారు: చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. పాతగుంటూరు పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వి.రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. ఈనెల 27న సీతారామ్‌నగర్‌లో నివాసం ఉండే కల్లూరి వేణుగోపాల్ నివాసంలో చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్ సమాచారం ఆధారంగా పాత నేరస్తుడే చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. గతంలో పలు కేసులు ఉన్న శివనాగరాజుకాలనీకి చెందిన ఎర్రసాని రాజు అలియాస్ ఇమ్మానియేలు చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు. మంగళవారం కాకాని రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజును అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. అదేవిధంగా 2022లో పాతగుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలో చేసిన మరో చోరీకి సంబంధించిన సొత్తు కలిపి రూ. 3.50 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన హెడ్‌కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, నూరుద్దీన్, శామ్యూల్‌రాజు, రాములను సీఐ రమేష్ అభినందించారు. ఈమేరకు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐలు అమరవర్ధన్, భాగ్యరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆగస్టు 5 వరకు ప్రజా దర్బార్ రద్దు

తాడేపల్లిరూరల్: నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ ఉండవల్లి సెంటర్‌లోని తన కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమం బుధవారం నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు రద్దు చేసినట్లు మంగళవారం ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. మళ్లీ ప్రజా దర్బార్ కార్యక్రమం జరిగే సమయం, తేదీలను ప్రకటిస్తామని, ప్రజలు సహకరించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: విద్యుత్ మరమ్మతులు నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. నవులూరులోని ఈఎస్ఆర్ గార్డెన్స్, గోలి వారి తోట, మక్కెవారి పేట, బాపనయ్య నగర్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇరువర్గాల ఘర్షణపై కేసులు

ఫిరంగిపురం: మండలంలోని గరుడాచలపాలెంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి ఒక వర్గానికి చెందిన వారు మరో వర్గానికి చెందిన వారిపై దాడికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. దీంతో ఒక వర్గానికి చెందిన ముగ్గురికి గాయాలు కావడంతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. దీనిపై క్షతగాత్రుల్లో ఒకరైన కె.సుమతి, మరో వర్గానికి చెందిన కె.చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరనారాయణ మంగళవారం తెలిపారు.

డాక్టర్ డీఎస్ఎన్ శర్మకు ఘన నివాళి



శర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలోని వైద్యసేవలు అందించిన డాక్టర్ డీఎస్ఎన్ శర్మ వర్ధంతి మంగళవారం మారుతి ఫౌండేషన్ చైర్మన్ జంగాల సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ డీఎస్ఎన్ శర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంగాల సాంబశివరావు మాట్లాడుతూ వైద్యవృత్తిలో అనేక సేవలు అందించన డాక్టర్ శర్మను గుర్తుపెట్టుకోవడం అభినందనీయమని చెప్పారు. వైద్య విద్యార్థులు డాక్టర్ శర్మను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. గతంలో తాడేపల్లి వరకు మాత్రమే ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థులకు ఉచితంగా టెస్ట్‌బుక్స్ అందజేసినట్లు చెప్పారు. ఇప్పుడు ఎంటీఎంసీ పరిధిలోని నిరుపేద వైద్యవిద్యార్థులకు ఉచితంగా టెక్ట్‌బుక్స్ అందజేస్తున్నామని అన్నారు. అనంతరం ముగ్గురు వైద్య విద్యార్థులకు రూ.40 వేల రూపాయల విలువ చేసే టెస్ట్‌బుక్స్, స్తతస్కోప్, బీపీ మిషన్‌లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కొలికపూడి రూఫస్, తాడిబోయిన నాగేశ్వరరావు(టీఎస్ఆర్) పాల్గొన్నారు.

సబ్జెక్టులపై అవగాహనతోనే పోటీ పరీక్షల్లో విజయం

జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

నెహ్రూనగర్: పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే సబ్జెక్టులపై పూర్తి అవగాహన, పట్టుదల, క్రమశిక్షణతో చదవగలిగితే విజయం సాధ్యమని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్‌తేజ పేర్కొన్నారు. మంగళవారం రాజాగారితోటలోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–2 మెయిన్స్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు హాజరవుతున్న అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలతో పాటు మార్కెట్‌లో లభించే ప్రామాణిక పుస్తకాలను ప్రణాళికాబద్ధంగా అధ్యాయనం చేసి చదివినట్లయితే ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తారని చెప్పారు. ఆయా సిలబస్‌కు సంబంధించిన టెక్ట్స్ బుక్స్‌నే కాకుండా ప్రస్తుతం జరుగుతున్న అన్ని కరెంట్ అంశాలకు సంబంధించిన విషయాలపై పూర్తి అవగాహన కొరకు ప్రతి రోజు తెలుగు, ఇంగ్లిష్ పేపర్స్ తప్పకుండా చదువుతూ సొంత నోట్స్‌ను తయారు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పరీక్ష రాసే సమయంలో కష్టంగా ఉన్న బిట్స్‌ను టెక్నికల్‌గా ఆలోచించి ఎవరైతే కరెక్ట్ ఆన్సర్స్ చేయగలుగుతారో వారే అంతిమంగా విజయం సాధించగలుగుతారన్నారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.మధుసూదనరావు, హిస్టరీ ఫ్యాకల్టీ రఫీ, ఇండియన్ పాలిటీ ఫ్యాకల్టీ మార్కండేయులు పాల్గొన్నారు.

లైన్‌లో వేచి ఉండకండి.. ఆన్‌లైన్‌లోకి మారండి

- రైల్వే రిజర్వేషన్ రహిత టికెట్లు ఆన్‌లైన్‌లో లభ్యం
- యూటీఎస్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి
- ఉచితంగా రిజిస్టర్ అవ్వండి
- గుంటూరు రైల్వే స్టేషన్‌లో అవగాహన



యూటీఎస్ మొబైల్ యాప్ లోగో

లక్ష్మీపురం: ప్రస్తుతం ప్రజలు టెక్నాలజీపై మోజు పెరిగింది. రైల్వే శాఖ సాంకేతిక టెక్నాలజీ విస్తృతంగా వినియోగిస్తోంది. దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణికుల సౌకర్యార్థం వినూత్నంగా సేవలు అందిస్తున్నారు. 2018 జూలై 16న దక్షిణ మధ్య రైల్వే ఆన్‌లైన్ టికెట్ల కోసం ప్రయాణికులకు సేవలు అందించేందుకు యూటీఎస్ యాప్‌ను ప్రవేశ పెట్టిన విషయం విధితమే. అయితే ఈ యాప్‌ను అన్ని డివిజన్‌లలో పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రయాణికులకు ఈ యాప్ గురించి అవగాహన కల్పించాల్సిందిగా దక్షిణ మధ్య రైల్వే జీఎం స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గుంటూరు డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ దీన్ని విస్తృతం ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు..

గుంటూరు రైల్వే స్టేషన్‌లో డివిజన్ సీనియర్ డీసీఎం కమలాకర్ బాబు ప్రయాణికులకు యూటీఎస్ యాప్ గురించి అవగాహన కల్పించి మొబైల్ ఫోన్‌లలో యాప్‌లను డౌన్‌లోడ్ చేసే విధానాన్ని తెలియజేస్తున్నారు. డివిజన్‌లో ఆయా స్టేషన్‌లలో యూటీఎస్ ఆన్‌లైన్ టికెట్ల యాప్ గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఈ యాప్‌ను వినియోగించడం వలన ప్రయాణికులకు కాగితంపై వివరాలను రాయాల్సిన అవసరం ఉండదు. ప్రయాణికుడి చేతిలో ఆండ్రాయిడ్ మొబైల్ ఉండి దానిలో ప్లే స్టోర్‌లోకి వెళ్లి యూటీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకుంటే చాలు అన్ని అధికారులు చెబుతున్నారు. రైల్వే అధికారులు కాగితం అక్కరలేని సాధారణ ప్రయాణ టికెట్లు కొనడానికి స్మార్ట్ ఫోన్ ఉపయోగించమని అంటున్నారు. ఈ యాప్ ద్వారా రైల్వే ప్రయాణికులు సీజన్ టికెట్లు, ప్లాట్ ఫారం టికెట్లు కొనుగోలు కోసం యూటీఎస్ యాప్ ఉపయోగించాల్సిందిగా కోరుతున్నారు.

కాగితం అవసరం లేని యూటీఎస్ యాప్



ఈ యాప్‌ను వినియోగం గురించి గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రయాణికులకు ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. ఈ యాప్ సాధారణ ప్రయాణ టికెట్లు రైల్వే స్టేషన్ నుంచి 15 మీటర్ల దూరంలో, ప్రయాణం ప్రారంభించే స్టేషన్ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో బుక్ చేసుకోవచ్చు. నగదు రహిత చెల్లింపులతో సాధారణ ప్రయాణ టికెట్లు ఆన్‌లైన్‌లో చేసుకునేందుకు వీలుగా ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వేలోని ఏ యూటీఎస్ స్టేషన్ నుంచి ఏ స్టేషన్‌కైనా సీజన్, ప్లాట్ ఫారం, సాధారణ ప్రయాణ టికెట్‌లను బుక్ చేసుకోవచ్చు. సీజన్ టికెట్‌ల రెన్యూవల్ పరిధి ముందుగానే చేసుకోవచ్చు. మొబైల్ ఫోన్‌లో సేవ్ అయి టికెట్‌ల బుకింగ్ వివరాలు ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్(టీటీఈ)కు చూపించవచ్చు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా యూటీఎస్ మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేశాం.

– ఎం.రామకృష్ణ, డీఆర్ఎం, గుంటూరు డివిజన్

ఆర్-వేలెట్ రీచార్జ్ ఇలా చేసుకోవాలి....

- యూటీఎస్ మొబైల్ యాప్
- డెబిట్ కార్డ్
- నెట్ బ్యాంకింగ్
- వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ యూటీఎస్ ఓఎన్‌మొబైల్.ఐఎన్‌డీఐఏఎన్‌రైల్వే.జీఓవి.ఐన్‌లో కూడా టికెట్స్ పొందవచ్చు.
- రూ.100 నుంచి గరిష్టంగా రూ.10 వేల వరకు రీచార్జి చేసుకోవచ్చు. ప్రతి రీచార్జిపై 5 శాతం అదనపు బోనస్ పొందవచ్చు.

టికెట్‌లు బుక్ చేసుకోవడానికి..

- ఆండ్రాయిడ్, విండోస్ లేక ఐఫోన్ స్మార్ట్ ఫోన్ ద్వారా యూటీఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయాలి.
- మొదటి సారి ఉపయోగించే వారు సైన్ అప్ చేయాలి. ఇప్పటికే వినియోగిస్తున్నవారు పాస్‌వర్డ్‌తో నేరుగా లాగిన్ చేయాలి
- డ్రాప్ డౌన్ మెను నుంచి స్టేషన్‌ని ఎంపిక చేసుకోవాలి
- తరుచుగా ప్రయాణించే వారు క్విక్ బుకింగ్ ఎంపిక చేసుకోవాలి
- ఆర్–వేలెట్, పేటీఎం, మొబిక్విక్, ఉపయోగించి టికెట్లు కొనుగోలు చేసుకోవాలి.

వ్యక్తిపై దాడి

గుంటూరుఈస్ట్: చిట్ డబ్బులు అడిగినందుకు నిర్వాహకుడిని భార్యాభర్త కలసి దాడిచేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సంగడిగుంటకు చెందిన సయ్యద్ మహబూబ్‌సుభాని మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య సిబ్బందిపై సూపర్‌వైజర్‌గా పనిచేస్తుంటాడు. అదే విధంగా చిట్‌లు వేస్తుంటాడు. లక్ష్మీత్రివేణి సుభాని వద్ద పనిచేస్తూ చిట్ వేసింది. చిట్ డబ్బులు చెల్లించలేదు. మంగళవారం సుభాని లక్ష్మీ త్రివేణిని నగరంపాలెంలో డబ్బులు చెల్లించాలని నిలదీశాడు. త్రివేణి భర్త శ్యామ్‌కు ఫోన్ చేసి పిలిపించింది. త్రివేణి, శ్యామ్ ఇరువురు కలసి సుభానిపై దాడిచేశారు. సుభాని పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రాలపై వివక్ష

లక్ష్మీపురం: నీతి ఆయోగ్ సమావేశానికి ఏకంగా పది రాష్ట్రాల ముఖ్యమంత్రులు దూరంగా ఉండటం, వచ్చిన పశ్చిమ బెంగాల్ సి.ఎం మధ్యలోనే వాకౌట్ చేయడం రాష్ట్రాలపై కేంద్రం అనుసరిస్తున్న వివక్షకు నిదర్శనమని సీనియర్ ఇంజినీర్ పి.ఘనశ్యామాచార్యులు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ప్రధాని అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశం ప్రస్తుతం దేశ రాజకీయాల్లో సంచలనం అయిందని తెలిపారు. వివక్ష పాలిత రాష్ట్రాలపై కేంద్రం తీవ్ర వివక్ష చూపటాన్ని ముఖ్యమంత్రులు నిరసించటానికి దీన్ని అవకాశంగా తీసుకున్నారన్నారు. అనంతరం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, రాజకీయ విశ్లేషకులు వి.వి.రావ్ ప్రసంగించారు.

ఖాతాదారుల ఉన్నతికి యూబీఐ కృషి



రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్న యూబీఐ రీజనల్ హెడ్ జవహర్, మాజీ మంత్రి ఆలపాటి

కొరిటెపాడు(గుంటూరు): ఖాతాదారుల ఉన్నతికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) కృషి చేస్తోందని ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎస్.జవహర్ తెలిపారు. ఖాతాదారుల ప్రయోజనాలే లక్ష్యంగా సేవలందిస్తున్నామని చెప్పారు. నగరంపాలెంలోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎంఎస్ఎంఈ ఎంపవర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ యూబీఐ ద్వారా సకాలంలో సరళమైన వడ్డీ రేట్లతో పారిశ్రామిక రుణాలను అందిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ ఎంపవర్ స్కీం కింద రూ. కోటి నుంచి రూ.50 కోట్ల వరకు 50 శాతం కొల్లాటరల్‌తో రుణ సదుపాయం ఇవ్వటం జరుగుతోందని పేర్కొన్నారు. అంతేకాక మహిళలకు తక్కువ మార్జిన్, వడ్డీ రేటు, సెక్యూరిటీతో యూనియన్ నారి శక్తి కింద ప్రత్యేక రుణం మంజూరు చేయటం జరుగుతోందని వివరించారు. అనంతరం పలువురు ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు.

ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా దినేష్‌కుమార్ బాధ్యతలు తీసుకోకపోవడంతో నగరపాలక సంస్థలో పనిచేసే ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు పడే పరిస్థితి లేదని ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదుల మూడి మధుబాబు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యేను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ కమిషనర్‌గా పనిచేసిన కీర్తి చేకూరి బదిలీపై ఏపీ ట్రాన్స్ కో వెళ్లడంతో గుంటూరు నగర కమిషనర్‌గా దినేష్‌కుమార్ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాని ఇంత వరకు నూతన కమిషనర్‌గా దినేష్‌కుమార్ బాధ్యతలు తీసుకోకపోవడంతో నగరపాలక సంస్థ ఆప్కాస్ కింద విధులు నిర్వహిస్తున్న మూడే వేల మంది ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఎవరైతే కమిషనర్‌గా ఉంటారో వారు సీఎఫ్ఎంఎస్ వెబ్‌సైట్‌లో వేలిముద్ర వేస్తేనే ప్రభుత్వం జీతాలు మంజూరు చేస్తుందని వివరించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారించాలని విన్నవించారు.